క్లుప్తంగా

బ్రాహ్మణ అభివృద్ధి సమాఖ్య నూతన కమిటీ ఎన్నిక

బోట్‌క్లబ్: బ్రాహ్మణ అభివృద్ధి సమాఖ్య సేవా సంఘం నూతన కమిటీని సభ్యులు గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం వ్యవస్థాపకుడు, అధ్యక్షుడిగా పసుమర్తి సత్యనారాయణమూర్తి, గౌరవ అధ్యక్షులుగా దివి శ్రీనివాస్ ఆచార్యులు, గరిమెళ్ల లక్ష్మీనారాయణ శర్మ, తనికెళ్ల వెంకటరామయ్య శర్మ, ముఖ్య సలహాదారులుగా నాగ మహేశయ, ఎల్లాప్రగడ పద్మనాభస్వామి, ఉపాధ్యక్షులుగా కడియాల సత్యనారాయణ మూర్తి, కార్యదర్శిగా పి.బాలాజీ విశ్వనాథ్, ఉప కార్యదర్శిగా మర్ల జగన్నాథ్ శర్మ, కోశాధికారిగా కప్పగంతు సాయిరామ్ శర్మ ఎన్నికయ్యారు. నగరంలోని ప్రముఖులను ఆహ్వానించి వారందరికీ సముచిత పదవులు కల్పించడం, బ్రాహ్మణ కమ్యూనిటీ హాల్, బ్రాహ్మణ సత్రాన్ని ఏర్పాటు చేయాలని, నగరంలో ఉన్న అన్ని బ్రాహ్మణ సంఘాల నాయకులను కలుపుకుంటూ ముందుకు సాగాలని, బ్రాహ్మణ హెల్ప్ లైన్ ఏర్పాటు చేయాలని, నగరంలో అన్ని డివిజన్లకు ఇన్‌చార్జిలను నియమించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధ్యక్షులు సత్యనారాయణమూర్తి తెలిపారు.

ఘనంగా క్విట్ ఇండియా ఉద్యమ దినోత్సవం

కాకినాడ రూరల్: స్థానిక సర్పవరం జంక్షన్‌లో బోటుక్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో క్విట్ ఇండియా ఉద్యమ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వాకర్స్ సంఘ అధ్యక్షుడు అడబాల రత్న ప్రసాద్, డాక్టర్ శిరీష, రాజా, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

బుద్ధదేవ్ భట్టాచార్యకు సీపీఎం నివాళులు



భట్టాచార్య మృతికి నివాళులర్పిస్తున్న నాయకులు

కాకినాడ సిటీ: సీపీఎం అగ్రనేత పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య మృతికి గురువారం సీపీఎం జిల్లా కమిటీ నివాళులర్పించింది. గురువారం సుందరయ్యభవన్‌లో జరిగిన సంతాప సభలో సీపీఎం జిల్లా కన్వీనర్ ఎం రాజశేఖర్ మాట్లాడుతూ 2001 నుంచి 2011 వరకు భట్టాచార్య పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రిగా పని చేశారన్నారు. బెంగాల్ ఆర్థికంగా, పారిశ్రామికంగా అభివృద్ధి చెందడానికి ఆయన ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు వీరబాబు, కేఎస్ శ్రీనివాస్, కె.సింహాచలం, ఎం.విజయకుమార్, టి.రాజా, వి.చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని మహిళకు తీవ్ర గాయాలు



గాయపడిన మహిళకు సపర్యలు చేస్తున్న స్థానికులు

కరప: ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన కథనం మేరకు పెదపూడి మండలం శహపురం గ్రామానికి చెందిన బుద్దాల నూకరత్నం గురువారం మధ్యాహ్నం కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న తమ బంధువులను చూసేందుకు కరపలో బస్సు కోసం నిలబడింది. అదే సమయంలో రామచంద్రపురం నుంచి కాకినాడ వెళుతున్న ఆర్టీసీ బస్సు ఆమెను ఢీకొట్టగా రోడ్డుపై పడిపోయింది. ఆర్టీసీ బస్సు ముందర చక్రాలు నూకరత్నం రెండు కాళ్లపై నుంచి పోవడంతో తీవ్రగాయాలయ్యాయి. కుడిచేతికి కూడా గాయమైంది. ఈ విషయం తెలుసుకున్న ఆమె బంధువులు హుటాహుటిన వచ్చి, చికిత్సకోసం 108లో కాకినాడ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కరప ఎస్‌ఐ టి.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వక్ఫ్ చట్ట సవరణ నష్ట దాయకం

వక్ఫ్‌బోర్డు మాజీ డైరెక్టర్ బషీర్



కాకినాడ: కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన వక్ఫ్ చట్ట సవరణలు తీవ్ర నష్ట దాయకమని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు మాజీ డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డు అధికారాలను తగ్గించడంతో పాటు మహిళలు, ముస్లింలు కాని వ్యక్తులను బోర్డులలో చేర్చాలనే ప్రతిపాదన ఏ మాత్రం సమంజసం కాదన్నారు. ఈ సవరణలు వల్ల ముస్లిం సమాజానికి తీవ్రనష్టం కలుగుతుందన్నారు. అవినీతిని తగ్గించి జవాబుదారీతనాన్ని పెంచాలనే లక్ష్యంతో ఈ ప్రతిపాదనలు చేస్తున్నట్టు చెబుతున్నప్పటికీ వక్ఫ్ బోర్డుల అధికారాలను కుదించే ప్రక్రియలో భాగంగానే ఇలాంటి ప్రతిపాదనలు చేస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై కేంద్రం పునః సమీక్షించాలని ఆయన కోరారు.

ప్రయాణం బిక్కుబిక్కు

- వాహన చోదకులకు తప్పని తిప్పలు
- కురుస్తున్న వర్షాలకు రోడ్లన్నీ ఛిద్రం
- గుంతల దారుల్లో ప్రమాదాలు



స్థానిక టూ టౌన్ ఓవర్ బ్రిడ్జిపై గుంతలు



స్థానిక జగన్నాథపురం ఎన్టీఆర్ బ్రిడ్జిపై ఏర్పడిన భారీ గోతులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ నగరంలో రోడ్లన్ని అధ్వానంగా మారాయి. పేరుకే స్మార్ట్‌సిటీ గాని కురుస్తున్న వర్షాలకు భారీగా ఏర్పడిన గోతులు పూడ్చక పోవడంతో వాహనచోదకులు తిప్పలు పడుతున్నారు. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదని వాహనచోదకులు, ప్రయాణికులు వాపోతున్నారు. నగరంలో జగన్నాథపురం ఎన్టీఆర్ బ్రిడ్జి, టూటౌన్ బ్రిడ్జి ప్రధాన రహదారులు గుంతలమయంగా మారింది. అలాగే గాంధీనగర్, అశోక్‌నగర్, బాలాజీచెరువు జంక్షన్, శ్రీనగర్, సంత మార్కెట్ సెంటర్, నాగమల్లితోట జంక్షన్, స్టేడియం రోడ్, రామకృష్ణారావు పేట ప్రాంతాల్లో రోడ్డుపై ప్రయాణం చేయాలంటేనే జంకుతున్నారు. కొందరు ప్రమాదాల బారిన పడుతున్నా అధికారుల్లో చలనం రావడం లేదని స్థానికులు చెబుతున్నారు. రామారావు పేటలోని కార్పొరేషన్ కమిషనర్ బంగ్లా వెనుక రోడ్డు గుంతల మయంగా మారింది. నిత్యం కార్పొరేషన్ అధికారులు ఆ మార్గంలోనే వెళ్తున్నా గుంతలు వారికి కనిపించడం లేదా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. స్మార్ట్ సిటీ పేరున ఉన్న నిధులు రోడ్ల మరమత్తులకు వినియోగించక పోవడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. కురుస్తున్న వర్షాలకు గుంతల్లో నీళ్లు చేరి పగలు రోడ్డు ఉందనుకుని వెళ్లి ప్రమాదాలపాలవుతున్నారు. రామచంద్రపురం నుంచి కాకినాడకు చేరుకునే ప్రధాన రహదారి జగన్నాథపురం ఎన్టీఆర్ బ్రిడ్జి రహదారి పూర్తిగా ధ్వంసమైంది. రమణయ్యపేట, గైగోలుపాడు, మెయిన్‌రోడ్డు కూడా గుంతలమయంగా మారింది.

బైక్‌పై వెళ్లాలంటే భయమే



కాకినాడ ఎన్టీఆర్ బ్రిడ్జి నుంచి కాకినాడ నగరంలోకి బైక్‌పై వెళ్లాలంటే గుబులు పుడుతోంది. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని భయంగా ఉంది. భారీ గుంతలు, దీనికి తోడు కురుస్తున్న వర్షాలకు గుంతల లోతు తెలియక తరచూ ఈ ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్ల మరమ్మతులకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కె.రాజు, వాహన చోదకుడు



స్థానిక రామారావు పేట మున్సిపల్ కమిషనర్ బంగ్లా వెనుక రోడ్డులో ఏర్పడిన గోతులు

నిత్య వ్యాయామంతో నిండైన ఆరోగ్యం



ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ లావణ్యకుమారి, డాక్టర్ విఠల్ తదితరులు

కాకినాడ క్రైం: నిండైన ఆరోగ్యానికి నిత్య వ్యాయామం తప్పనిసరి అని జీజీహెచ్ సూపరింటిండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, ఆర్థోపెడిక్ హెచ్‌ఓడీ డాక్టర్ ఎంపీఆర్ విఠల్ అన్నారు. గురువారం జాతీయ ఎముకల వ్యాధుల నివారణ వారోత్సవాలు జీజీహెచ్‌లో ప్రారంభమయ్యాయి. సూపరింటెండెంట్, హెచ్‌ఓడీలు ఆసుపత్రిలో అవగాహన ర్యాలీ ద్వారా వారోత్సవాలను ప్రారంభించారు. ర్యాలీలో వైద్య విద్యార్థులు వ్యాయామం ఆవశ్యకతపై నినాదాలిచ్చారు. డాక్టర్ లావణ్యకుమారి మాట్లాడుతూ యాంత్రీకరణ, సాంకేతికత వల్ల మానవ జీవనం వ్యాయామానికి దూరమైందని అన్నారు. మారుతున్న జీవన శైలి ఎముకలకు సంబంధించిన అనేక అనారోగ్యాలకు కారణమవుతోందని తెలిపారు. కార్యక్రమంలో డీసీఆర్ఆర్ఎంవో డాక్టర్ అనిత, ఫిజియోథెరపీ హెచ్‌ఓడీ డాక్టర్ సాయినాథ్, ఆర్థోపెడిక్ వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

వర్షపు నీరు నిల్వలేకుండా చర్యలు

- అధికారులకు కమిషనర్ ఆదేశం



అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ భావన

కాకినాడ: వర్షపునీరు నిల్వలేకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని నగరపాలక సంస్థ కార్యాలయ కమిషనర్ భావన అధికారులను ఆదేశించారు. గురువారం ఆమె వర్షాల వల్ల ముంపునకు గురైన ప్రాంతాల్లో పర్యటించారు. ఆనంద భారతి, మెయిన్‌రోడ్డు ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచిపోవడాన్ని గుర్తించి అధికారులకు సూచనలిచ్చారు. డ్రైన్ అవుట్‌లెట్లను శుభ్రం చేయాలని ఆదేశించారు. ఈదురుగాలులు, వర్షాలు పడిన సమయంలో చెట్లు పడిపోయి అంతరాయం కలిగితే ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆమె వెంట ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, అధికారులు ఉన్నారు.

ప్రజా ఫిర్యాదులపై పరిశీలన

ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా వచ్చిన సమస్యలపై కమిషనర్ భావన శుక్రవారం క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవికతను పరిశీలించారు. డైరీఫారం సెంటర్‌లోని పాములాల తూము నుంచి పళ్లంరాజు నగర్ 1వ వీధికి రాకపోకలు పునరుద్ధరించాలనే అంశంతో పాటు ఇతర సమస్యలపై ఆమె స్వయంగా పరిశీలించి డీసీపీ హరిదాసుకు ఆదేశాలిచ్చారు.

నగర వనాల ఏర్పాటుకు స్థల పరిశీలన

ప్రభుత్వ ఆదేశాల మేరకు కాకినాడలో నగర వనాలు (అర్బన్ ఫారెస్ట్ ప్లాంటేషన్) ఏర్పాటు చేయనున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ భావన తెలిపారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలపై గురువారం ఆమె మెక్లారిన్ హైస్కూల్, ప్రభుత్వ ఐటీఐ, ఆర్ఆర్ పార్కులను సందర్శించారు. ఈ నెల 12–15 తేదీలలో అర్బన్ ప్లాంటేషన్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రారంభించనున్నారని తెలిపారు. ఇందుకు సంబంధించి అనువైన స్థలాలు, మైదానాలను ఎంపిక చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ మేరకు అనువైన స్థలాలను గుర్తించాలని ఆమె డీసీపీ హరిదాస్, ఉద్యాన సహాయ సంచాలకులు టీవీ సిరిల్‌ను ఆదేశించారు.

విద్యార్థి దశలో ఆలోచనలే జీవిత లక్ష్యాలు



విశ్రాంత ఐఎఫ్ఎస్ అధికారి రామప్రసాద్‌ను సత్కరిస్తున్న ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): విద్యార్థి దశలో వచ్చే ఆలోచనలే మన జీవిత లక్ష్యాలను నిర్దేశిస్తాయని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రం మాజీ డైరెక్టర్ ఎం.రామప్రసాద్ (ఐఎఫ్ఎస్) పేర్కొన్నారు. జేఎన్టీయూకేలో గురువారం ×లక్ష్యాన్ని నిర్దేశించడం–పరివర్తన చెందేందుకు శిక్షణ అనే అంశంగా బీటెక్ ప్రథమ సంవత్సర విద్యార్థులకు సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథి రామప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థి దశలో లక్ష్యాన్ని నిర్దేశించుకుంటే సంతోషంగా జీవించవచ్చని అన్నారు. ఇన్‌చార్జి వీసీ డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే దిగ్గజాల అడుగుజాడల్లో నడిస్తే ఉన్నత శిఖరాలకు ఎదగవచ్చన్నారు. అనంతరం రామప్రసాద్‌ను ఇన్‌ఛార్జ్ వీసీ మురళీకృష్ణ సత్కరించారు. రెక్టార్ కేవీ రమణ, ప్రిన్సిపాల్ ఎస్.మోహనరావు, వైస్ ప్రిన్సిపాల్ మీరాసాహెబ్, పెట్రోలియం హెడ్ కృష్ణభాస్కర్ పాల్గొన్నారు.

కస్టమ్స్ ఉద్యోగుల రక్తదాన శిబిరం



శిబిరంలో రక్తదానం చేస్తున్న కస్టమ్స్ ఉద్యోగులు

కాకినాడ: తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం కాకినాడ కస్టమ్స్ అధికారులు, ఉద్యోగులు గురువారం స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. కస్టమ్స్, సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి ఆదేశాల మేరకు కాకినాడ కస్టమ్స్ హౌస్‌లో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కస్టమ్స్ ఉద్యోగులతో పాటు ఆదిత్య విద్యార్థులు, కేఎస్‌పీఎల్, కోరమండల్, సాయి ఆయిల్ ఫీల్డ్, శాన్‌మెరైన్ సంస్థల ఉద్యోగులు శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా చీఫ్ కమిషనర్ సంజయ్‌రాఠీ మాట్లాడుతూ తలసేమియ వ్యాధిగ్రస్తుల కోసం కస్టమ్స్ ఉద్యోగుల ద్వారా 4 వేల యూనిట్ల రక్తదానం చేయాలని నిర్ణయించామన్నారు. బాధ్యత కలిగిన ప్రతి పౌరుడు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. శిబిరంలో సుమారు 200 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్లు ఎం.శ్రీనివాస్, అబ్దుల్ అజీమ్, సూపరింటెండెంట్లు కె.శివకుమార్, ఇ.శ్రీనివాసచౌదరి, భాను, దయానంద్, వై.శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్లు పి.వెంకటేష్, నేమాని ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు. రెడ్‌క్రాస్ సంస్థ రక్తదానానికి తోడ్పాటు అందించింది.

ఉచిత ఉపకరణాలకు 209 మంది దివ్యాంగుల ఎంపిక



ఉపకరణాల కోసం తమ పేర్లను నమోదు చేయించుకుంటున్న దివ్యాంగులు

కాకినాడ రూరల్: దివ్యాంగుల ఉపకరణాల కోసం స్థానిక రమణయ్యపేట మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం ప్రత్యేక శిబిరం నిర్వహించారు. జిల్లా దివ్యాంగుల పునరావాసకేంద్రం (డీడీఆర్‌సీ), నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ లోకోమోటర్ డిజెబిలిటీస్ సంయుక్త ఆధ్వర్యంలో ఉమా మనోవికాస కేంద్రం సహకారంతో శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని విభిన్న ప్రతిభావంతుల, ట్రాన్స్ జెండర్, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ పి.నారాయణమూర్తి ప్రారంభించారు. వివిధ గ్రామాల నుంచి సుమారు 600 మంది హాజరు కాగా, వీరిలో సర్టిఫికెట్లు సక్రమంగా ఉన్న 209 మందిని ఉపకరణాలు ఇచ్చేందుకు నమోదు చేసుకున్నారు. శిబిరాన్ని ఎంపీడీఓ రమేష్‌నాయుడు పర్యవేక్షించారు. ఎమ్మెల్యే పంతం నానాజీ హాజరై దివ్యాంగులకు మధ్యాహ్నం పులిహోరను అల్పాహారం అందజేశారు.

దివ్యాంగులకు బ్యాటరీ ట్రై సైకిళ్ల పంపిణీ

స్థానిక వాకలపూడిలో డీడీఆర్‌సీ, ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీలో 86 మందికి బ్యాటరీ ట్రైసైకిళ్లు, కృత్రిమ పరికరాలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా డీఆర్డీఏ పీడీ శ్రీరమణి, జిల్లా విభిన్న ప్రతిభావంతుల, ట్రాన్స్‌జెండర్, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుడు పి.నారాయణమూర్తి పాల్గొన్నారు. సంస్థ ఎగ్జిగ్యూటివ్ డైరెక్టర్ ఎస్‌పీ రెడ్డి మాట్లాడుతూ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ లోకోమోటర్ డిజెబిలిటీస్ ఆధ్వర్యంలో గతంలో నిర్వహించిన శిబిరం ద్వారా గుర్తించిన వారికి 21.5 లక్షల విలువైన బ్యాటరీ ట్రైసైకిళ్లు, కృత్రిమ పరికరాలను కోల్‌కత్తాకు చెందిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ లోకోమోటర్ డిజెబిలిటీస్ సహకారంతో గురువారం వీటిని ఉచితంగా పంపిణీ చేశారన్నారు. అభిమన్యు, సింగ్, ఆక్యుపేషనల్ థెరపిస్ట్ అర్ష్య నంది, ఫిజియోథెరపిస్ట్ అరూప్ కేఆర్, కె నారాయణ రెడ్డి, ఎస్.ఉమారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



ట్రైసైకిళ్లు, కృత్రిమ పరికాలు అందజేస్తున్న దృశ్యం

హాకీలో కాంస్యంపై సంబరాలు



డీఎస్ఏలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న క్రీడాకారులు, కోచ్‌లు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ప్యారిస్ ఒలింపిక్స్‌లో టీం ఇండియా హాకీలో గురువారం కాంస్య పతకం సాధించడంపై జిల్లా క్రీడామైదానంలో క్రీడాకారులు, కోచ్‌లు సంబరాలు చేసుకున్నారు. డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్ ఆధ్వర్యంలో హాకీ కోచ్, పీడీ రవిరాజు కేక్‌ను కట్ చేసి అందరికీ పంచారు. అనంతరం డీఎస్ఏ నుంచి భానుగుడి సెంటర్‌కు చేరుకుని ర్యాలీ నిర్వహించారు. జిల్లా క్రీడాకారులు టీం ఇండియా హాకీ జట్టును స్ఫూర్తిగా తీసుకుని క్రీడల్లో రాణించాలన్నారు. డీఎస్ఏ కోచ్‌లు నాగేంద్ర, సమీర్, రుద్ర, హాకీ క్రీడాకారులు పాల్గొన్నారు. డీఎస్ఏకు 65 అంగుళాల టీవీని అందించినందుకు కలెక్టర్‌కు డీఎస్‌డీఓ ధన్యవాదాలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాకినాడ: విద్యుత్ వార్షిక మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ ఎస్.ఉదయ్‌భాస్కర్ తెలిపారు. పవర్‌హౌస్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని కలెక్టరేట్ ఫీడర్‌లో ఉదయం 7.30 నుంచి 9.30 గంటల వరకు కలెక్టరేట్ కాంపౌండ్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు. అలాగే పవర్‌హౌస్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 నుంచి 1 గంట వరకు నూకాలమ్మగుడి ప్రాంతం, గోపాలకృష్ణవీధి, దంటువారివీధి, మున్సబుగారివీధి, హోండా షోరూమ్ సెంటర్, జవహర్ వీధి ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే గోల్డ్ మార్కెట్ ఫీడర్ పరిధిలో తిలక్‌వీధి, పాత పోస్టాఫీసు వీధి, సినిమా రోడ్డు, కొత్తవారి వీధి, రాజాజీ వీధి, దేవాలయం వీధి, వార్ఫురోడ్డు ప్రాంతాలకు అంతరాయం కలుగుతుందన్నారు. ఈ అసౌకర్యానికి ప్రజలు సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

డి–4 పరిధిలో..

కాకినాడ రూరల్: వార్షిక మరమ్మతుల నిమిత్తం డి–4 సెక్షన్ సర్పవరం సబ్‌స్టేషన్ పరిధిలో రమణయ్యపేటలో పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ ఎస్.ఉదయ్ భాస్కర్ తెలిపారు. రమణయ్యపేట ఏరియాలో ఐశ్వర్యనగర్ 1, 2, 3, 4, అవంతినగర్, ఆంజనేయనగర్, సీటీఓ ఆఫీసు కాలనీ, బాపన్నదొర కాలనీలకు ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

విపత్తులపై అవగాహన

కాకినాడ సిటీ: విపత్తు సంభవించినప్పుడు సమర్థవంతంగా రెస్క్యూ కార్యకలాపాలు నిర్వహించేలా జిల్లాలో ఫెమెక్స్ విపత్తు నిర్వహణ విన్యాసాలు నిర్వహించనున్నట్లు విపత్తుల నిర్వహణ శాఖ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎం లావణ్య తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ఎన్‌డీఆర్ఎఫ్ టీమ్ కమాండర్ మన్‌మోహన్ యాదవ్‌తో కలిసి రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కాకినాడ జిల్లాలో రాబోయే 20 రోజుల్లో విపత్తుల నివారణ చర్యలపై విపత్తుల సమయంలో తీసుకోవల్సిన జాగ్రత్తలు, విపత్తుల తరువాత జరిగే పరిమాణాలను ఎదుర్కొనే నైపుణ్యాలపై ప్రజలకు, విద్యార్థులకు, ఆసుపత్రి సిబ్బందికి, రసాయన ఫ్యాక్టరీల సిబ్బందికి శిక్షణ, అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

వేతనాలివ్వాలని వినతి

కాకినాడ సిటీ: సమగ్ర శిక్ష అభియాన్‌లో ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ రీసోర్స్ టీచర్స్‌గా పనిచేస్తున్న ఉద్యోగులకు నేటికీ వేతనాలు రాకపోవడంతో కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని, తక్షణం వేతనాలు విడుదల చేయాలని కోరుతూ గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఐఈఆర్‌టీ ఉద్యోగులు జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐఈఆర్‌టీ ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు చెక్కల రాజ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషుబాబ్జీ, జిల్లా ఉపాధ్యక్షురాలు వై. వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

మద్యం తాగి బైక్ నడిపిన వారికి జైలు

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసులో ఆరుగురికి రెండు రోజుల జైలుశిక్ష, 12 మందికి జరిమానా విధిస్తూ కాకినాడ మూడో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నరసింహారావు తీర్పు చెప్పారు. ఆ వివరాల్లోకి వెళ్తే.. కాకినాడ ట్రాఫిక్- 1, 2 పోలీస్ స్టేషన్ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. గురువారం నిందితులను కోర్టులో హాజరుపర్చగా ఆరుగురికి ఒక్కొక్కరికి రెండు రోజుల జైలుశిక్ష, 12 మందికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

61 పాఠశాలల్లో ఎస్‌ఎంసీలు ఏకగ్రీవం

కాకినాడ రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు గురువారం జరిగాయి. ఎస్ఎంసీ ఎన్నికల కోసం ఈ నెల ఒకటిన నోటిఫికేషన్ విడుదలైన మేరకు గురువారం నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించారు. వీటిలో మొత్తం 61 పాఠశాలల్లో ఎస్ఎంసీలు ఏకగ్రీవం అయ్యాయి. ప్రతి తరగతి నుంచి ముగ్గురు సభ్యులను ఎన్నుకున్నారు. మధ్యాహ్నం ఎన్నికైన సభ్యుల నుంచి చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకున్నారు. కాకినాడ రూరల్‌లో మొత్తం 77 పాఠశాలలకు ఎన్నికలు నిర్వహించగా 30 పాఠశాలల్లో ఏకగ్రీవం అయ్యాయి. 47 పాఠశాలకు ఎన్నికలు జరిగాయి. ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్టు ఎంఈఓ వేణుగోపాల్ తెలిపారు.

కరపలో ప్రశాంతంగా ఎన్నికలు

కరప: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం ఎస్ఎంసీ ఎన్నికలు ముగిశాయి. మండల పరిధిలో 50 ప్రాథమిక, 5 ప్రాథమికోన్నత, 10 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఎంఈఓలు కె.బుల్లికృష్ణవేణి, పి.సత్యనారాయణ, ఆయా పాఠశాలల హెచ్ఎంల పర్యవేక్షణలో తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటు చేసి ఎన్నికల ప్రక్రియ అవగాహన కల్పించారు. నిబంధనల మేరకు ఎస్ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులను ఎన్నుకున్నారు. ఇందులో 27 ప్రాథమిక, 2 ప్రాథమికోన్నత, 3 ఉన్నత పాఠశాలల్లో ఎన్నికలు ఏకగ్రీవం కాగా, 23 ప్రాథమిక, 3 ప్రాథమికోన్నత, 7 ఉన్నత పాఠశాలల్లో ఓటింగ్ జరిగింది. కరప హైస్కూలులో సమగ్ర శిక్షాభియాన్ ఏఎస్ఓ వి.రాంబాబు, వీఆర్వో ఏవీఎస్ రామకృష్ణారెడ్డి, హెచ్ఎం ఎం.శ్రీనివాసరావుల పర్యవేక్షణలో ఎన్నిక నిర్వహించగా ఎస్ఎంసీ చైర్మన్‌గా దేవు దుర్గారావు, వైస్ చైర్మన్‌గా సాంబత్తుల పుష్ప శాంతకుమారి, సభ్యులను ఎన్నుకున్నారు. గురజనాపల్లి హైస్కూలులో చైర్మన్‌గా పోలిశెట్టి నూకరాజు, వైస్‌చైర్మన్‌గా కోట దుర్గాతులసి, 24 మంది సభ్యులు ఎన్నికయ్యారు. హెచ్ఎం ఎ.సాయిమోహన్, స్టాఫ్ సెక్రటరీ ఐ.ప్రసాదరావు తదితర ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. అరట్లకట్ట హైస్కూలులో చైర్మన్‌గా దారా వీరబాబు, వైస్ చైర్మన్‌గా సమ్మింగ్ చంద్ర, ఇతర కమిటీ సభ్యులను తల్లిదండ్రులు ఎన్నుకున్నట్టు హెచ్ఎం డాక్టర్ వి.వెంకటశివగిరి తెలిపారు. సర్పంచ్ గోపి సత్యవేణి, తదితర గ్రామస్తులు హాజరయ్యారు.

ఎస్‌ఎంసీ ఎన్నికల్లో రాజకీయాలు తగదు

బోట్‌క్లబ్: ప్రభుత్వ పాఠశాలల పేరెంట్స్ కమిటీ ఎన్నికలు విద్యార్థుల తల్లిదండ్రులకు మాత్రమే పరిమితం చేయకుండా రాజకీయ సభ్యత్వాల తరహాలో పార్టీశ్రేణుల ఆధ్వర్యంలో జరుగుతున్న తీరు అత్యంత ఆక్షేపణీయమని పౌర సంక్షేమ సంఘ కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు గురువారం అన్నారు. దేవాలయాలు, పాఠశాలలు రాజకీయపార్టీ శ్రేణుల దందాతో కొనసాగడం వల్ల రాజకీయ కార్యకలాపాలకు తప్ప సమాజహిత ప్రయోజనాలకు జరగవన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్ రోస్టర్ పాటించకుండా చాలా పాఠశాలల్లో ఎన్డీఏ అధికార పార్టీ శ్రేణులు హైజాక్ చేసి టీచర్లను డామినేట్ చేసి ఏకపక్షంగా నిర్వహించారన్నారు.

ఏరియా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడిగా వెంకన్న చౌదరి



వెంకన్న చౌదరిని అభినందిస్తున్న కార్యవర్గ సభ్యులు

కాకినాడ సిటీ: కాకినాడ ఏరియా రైస్ మిల్లర్ల సంఘం నూతన అధ్యక్షుడిగా మేదరమెట్ల వెంకన్న చౌదరి (బాబీ) ఎన్నికయ్యారు. గురువారం స్థానిక జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎనుకున్నారు. అధ్యక్షుడిగా మేదరమెట్ల వెంకన్న చౌదరి, ఉపాధ్యక్షుడిగా కొండపల్లి శ్రీనివాస్‌రావు, కార్యదర్శిగా పాతూరి శ్రీహరి చౌదరి, కోశాధికారిగా పెద్దిరెడ్డి రామానుజయ్య, సంయుక్త కార్యదర్శిగా ఆకెళ్ల శ్రీనివాస నాగేశ్వరరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం కార్యవర్గం ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నూతన కార్యవర్గాన్ని ఎమ్మెల్యే బుచ్చిరాజుతో పాటు కార్యక్రమంలో పాల్గొన్న రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నున్న రామకృష్ణ, ఆల్ ఇండియా రైస్ ఎక్స్‌పోర్ట్ అసోసియేషన్ అధ్యక్షులు బీవీ కృష్ణారావు, ఆర్ఎంపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్తిబాబు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రైస్ మిల్లర్లు నూతన కార్యవర్గాన్ని అభినందించారు.